# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీతో ఈరోజు సమావేశమయ్యారు.**

2. **రాష్ట్రంలోని రెండు, నాలుగు వరుసల రహదారులను జాతీయ రహదారులతో అనుసంధానిస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు.**

3. **రైతుల నుంచి ఇప్పటివరకు 31లక్షల 52వేల టన్నులకుపైగా ధాన్యం సేకరించామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

4. **రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆలయాల్లో రథసప్తమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.**

5. **పదవ తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నామని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీతో ఈరోజు సమావేశమైయ్యారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో రైతులకు రుణాలు, బ్యాంకుల సహకారంపై చర్చిస్తున్నారని అధికారులు తెలిపారు. అలాగే సంక్షేమ కార్యక్రమాలలో నిధుల జమ, రైతులకు రుణాల విషయంలో బ్యాంకర్లతో ముఖ్యమంత్రి చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

------------------------

ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో పవర్ లిఫ్టింగ్ విభాగంలో రాష్ట్రానికి కాంస్య పతకం లభించింది. విజయనగరానికి చెందిన టి.సత్యజ్యోతి 87 కేజీల పవర్ లిఫ్టింగ్ మహిళా విభాగంలో ఈ పతకాన్ని సాధించింది. పతకం సాధించిన సత్యజ్యోతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు.

------------------------

రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలలో సర్వీస్ ప్రొవైడర్ సెల్ టవర్‌తో సంబంధం లేకుండానే మొబైల్ వినియోగదారులు ఇంట్రా సర్కిల్ రోమింగ్ ద్వారా సిగ్నల్స్‌ను పొందవచ్చని భారత టెలికం శాఖ అదనపు సంచాలకులు రాజారెడ్డి తెలిపారు. విజయవాడలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. మారుమూల

గిరిజన గ్రామాలోనూ సిగ్నల్స్ సమస్యను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం డిజిటల్ భారత్ నిధి-డీబీఎన్‌ను ఏర్పాటు చేసిందని పేర్కొంటూ..

వాయిస్…31 సెకన్లు

---

రాష్ట్రంలోని రెండు, నాలుగు వరుసల రహదారులను జాతీయ రహదారులతో అనుసంధానిస్తామని రహదారులు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .. రహదారుల అనుసంధానం కోసం 3 వేల 500 కి.మీ. మేర అంచనాలు తయారు చేశామని, త్వరలో కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేస్తామని పేర్కొన్నారు. రహదారులలో గుంతలను పూడ్చడానికి రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి 61 కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. ఆరు నెలల్లో 18వేల కి.మీ. మేర రహదారుల మరమ్మతులు చేశామని తెలిపారు.

---

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పౌరసరఫరాల శాఖ ద్వారా రాష్ట్రంలో రైతుల నుంచి 31లక్షల 52వేల 7వందల 53 టన్నుల ధాన్యం సేకరించామని చెప్పారు. ఇందుకు గాను 7వేల 2వందల 22కోట్ల రూపాయలను రైతులకు చెల్లించినట్లు తెలిపారు. ఖరీఫ్ పంటకాలంలో 5లక్షల 3వందల 52 మంది రైతులకు లబ్ధి చేకూరిందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు.

---

క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులో నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో 18 సంవత్సరాల పైబడిన వారందరికీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని తెలుపుతూ…

..వాయిస్.. 31 సెకన్లు

---

రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆలయాల్లో రథసప్తమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లా మార్కాపురంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయంలో స్వామీవారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రథ సప్తమి సందర్భంగా తిరుపతిలోని తిరుచానూరులో టిటిడి సప్తవాహన సేవలను నిర్వహిస్తోంది. పలు వాహనాలపై పద్మావతి అమ్మవారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్నారు. పశ్చిమగోదారి జిల్లా, తాడేపల్లిగూడెంలో టిటిడి ఆధ్వర్యంలో సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

---

రాష్ట్రంలోని పదవ తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నామని పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉదయం 9 గంటల 30 నిముషాల నుంచి 12 గంటల 45 నిముషాల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొంది. భౌతిక, రసాయన శాస్త్రాలు ఒక్క పేపర్‌గా, జీవశాస్త్రం మరో పేపర్‌గా 50 మార్కుల చొప్పున నిర్వహిస్తామని విద్యాశాఖ తెలిపింది.

---

నిబంధనలు పాటించని పాఠశాల, కళాశాలల బస్సులపై చర్యలు తీసుకుంటున్నామని రవాణాశాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సీహెచ్ మనీషా తెలిపారు. పల్నాడు జిల్లా నర్సరావుపేటలో వివిధ కళాశాలల, పాఠశాలల బస్సులలో నిన్న ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

వాయిస్ 27 సెకన్లు

-----------------------------

రాజధాని అమరావతి మీదుగా కొత్త రైల్వే లైన్ నిర్మాణాన్ని ఎర్రుపాలెం – నంబూరు మధ్య నాలుగేళ్లలో పూర్తి చేయనున్నట్టు విజయవాడ డివిజినల్ మేనేజర్ నరేంద్ర ఎ. పాటిల్ తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రైల్వే బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం 9 వేల 417 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. అమరావతి రైల్వే లైనుకు ప్రస్తుతం ట్రాక్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన ప్రక్రియ కొనసాగుతోందన్నారు. 2 వేల 545 కోట్ల రూపాయలతో నిర్మించే అమరావతి కొత్త రైల్వే లైన్ గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, చెన్నై సహా పలు ప్రాంతాలను కలుపుతుందని తెలిపారు.

-----------------------------

రాష్ట్రంలో పలు కారణాలతో ఈ రోజుకు వాయిదా పడిన పలు పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల సంఘం ఈ రోజు ఎన్నికలను నిర్వహించింది. ఇందులో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కి నిర్వహించిన ఎన్నికలో 26మంది కార్పొరేటర్లు ఎన్డీయే కూటమి బలపరిచిన అభ్యర్థి ఆర్.సి.మునిక్రిష్ణకి మద్దతు తెలపడంతో ఆయన గెలుపొందారని అధికారులు తెలిపారు. కాగా నందిగామ, పాలకొండల్లో ఛైర్ పర్సన్, తుని, పిడుగురాళ్లలో వైస్ ఛైర్ పర్సన్ స్థానాలకు ఎన్నికలు కొనసాగుతున్నాయి.

-----------------------------

ఈరోజు ప్రపంచ క్యాన్సర్ నివారణాదినంగా పాటిస్తున్నారు. 2 వేల సంవత్సరంలో పారిస్‌లో జరిగిన మొదటి శిఖరాగ్ర సమావేశంలో క్యాన్సర్‌ను నివారించేందుకు అవగాహన కల్పించాలని, దీనికోసం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీన క్యాన్సర్ నివారణ దినంగా పాటించాలని నిర్ణయించారు. వాతావరణ కాలుష్యం, రసాయనాలతో కూడిన ఆహారపదార్థాలు తీసుకోవడం, ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం క్యాన్సర్‌వ్యాధికి కారణమవుతున్నాయి. ఈ వ్యాధిని ప్రాధమిక దశలో గుర్తిస్తే నయమవుతుందని... శాస్త్రవేత్తలు, వైద్యులు సూచిస్తున్నారు. క్యాన్సర్ నివారణదినం సందర్భంగా ఈరోజు దేశవ్యాప్తంగా పలు అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో క్యాన్సర్ బాధితులకు ఉపశమనం కలిగించే పలు రకాల క్యాన్సర్ ఔషధాలపై పన్ను మినహాయింపు, ప్రతి జిల్లాలో క్యాన్సర్ చికిత్సా కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించింది.

-----------------------------

ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాల ప్రజలకు సురక్షిత కృష్ణానది జలాలను అందించే తాగునీటి సరఫరా ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లాలోని ఎ.కొండూరు పరిసర ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన 50 కోట్ల రూపాయల తాగునీటి సరఫరా ప్రాజెక్టు పనులను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ నిన్న పరిశీలించారు. మండలంలోని 38 గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు అదనంగా నిర్మిస్తున్న 14 ట్యాంకుల పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యంలోపు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

======================